
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY
5

జోగులాంబ గద్వాల
జిల్లా వార్తలు
మంగళవారం 27 మే 2025



## వయోవృద్ధులు 731 మందేనా..?

- సీనియర్ సిటిజన్ కార్డుకు నోచుకోని 17 వేల మంది
- జిల్లాలో 18 వేల మందికి పైగా గుర్తింపు
- సరైన అవగాహన లేకపోవడంతో దూరం..
- వయసు ధ్రువీకరణ పత్రాలతో ఒకే రోజులో పొందే అవకాశం

7



వనపర్తి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డ్యూయల్ డెస్క్‌లు




# తడ బడి

ఆంధ్రజ్యోతి సర్వే

ఒకప్పుడు ప్రభుత్వ బడి అంటే బందెలదొడ్డి మాదిరి ఉంటేది.... ప్రభుత్వాలు మారినయ్.. అభివృద్ధి జరుగుతోంది.. దేశ భవిష్యత్‌ను నిర్దేశించే విద్యపై శ్రద్ధ పెరిగింది.. అదే ప్రభుత్వ బడిలో నిరుపేదలైనా విద్యాప్రమాణాలకు అనుగుణంగా విద్యనభ్యసించే పరిస్థితి వచ్చింది.... కనీస వసతులు అందుబాటులోకి వచ్చాయి.... ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులు ఉన్నారు.. ప్రభుత్వ పర్యవేక్షణ పెరిగింది. అన్నీ ఉన్నా ఎక్కడో తేడా కొడుతోంది... ఏటికేడు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రైవేటు పాఠశాలల్లో చదివించడం విద్యార్థుల తల్లిదండ్రులకు తలకు మించిన భారం అవుతోంది... ఇంత తడబాటు ఉన్నా అక్కడక్కడ మంచి ఫలితాలు రావడం అభిలషణీయం.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన సర్వేలో ఇలాంటి ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.



వనపర్తి జిల్లా ఇందిరానగర్ ఎంపీపీఎస్‌లో విద్యార్థులు చేతులు కడుక్కునేందుకు బిగించని కుళాయిలు

- ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు పెరిగినా తగ్గుతున్న విద్యార్థులు
- విద్యాబోధన, మౌలిక వసతుల విషయంలో తల్లిదండ్రులు నారాజ్
- స్పెషల్ యాక్టివిటీస్ ప్రభుత్వ పాఠశాలల్లో నిల్.. ప్రైవేటులో ఫుల్
- గవర్నమెంట్ బడి పిల్లలు ప్రైవేటుతో పోటీ పడలేరనే భావన ఎక్కువ
- అన్నీ ఉన్నా తగిన ఫలితాలను సాధించని టీచర్లు
- ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మేలంటున్న తల్లిదండ్రులు

మహబూబ్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఒకప్పటితో పోల్చితే చెట్ల కింద చదువులు లేవు.. ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా లేదు.. విద్యుత్ సౌకర్యం మొదలుకొని విద్యార్థులకు డ్యూయల్ డెస్క్‌ల వరకు అన్నీ సమకూరాయి. బోధనా వసతులు ఏటికేడు మెరుగవుతున్నప్పటికీ విద్యార్థుల సంఖ్య విషయంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారి మరుగున పడిపోతున్నాయి. అదే సమయంలో ప్రైవేటు పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి వాటిల్లో విద్యార్థుల సంఖ్య ప్రతీఏటా పెరుగుతూనే ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు యూనిఫాంలు, టై, బెల్టులు, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం కూడా ప్రస్తుతం అందుతున్నాయి. ఎక్కడా కొరత కూడా పెద్దగా కనిపించడం లేదు. అయినా తల్లిదండ్రుల్లో ఇంకా ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం రోజురోజుకూ తగ్గుతోంది. ఊర్లలోనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కాదని, అధిక ఫీజులు చెల్లించి మరీ తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చదివిస్తున్నారు. ప్రతీఏటా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ అది కూడా మొక్కుబడి కార్యక్రమంలా జరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులు, విద్యాబోధన, బడిబాట ఫలితాలపై సోమవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన సర్వేలో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావంతులతో శాంపిళ్లు సేకరించింది. ఈ సర్వేలో ప్రభుత్వ పాఠశాలల పట్ల వారి వైఖరి

మిగతా 6లో..

### ప్రమాణాల మెరుగుకు టీచర్లు కృషి చేయాలి



ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాప్రమాణాల అభివృద్ధికి కృషి చేయకపోవడంతోనే విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలవైపు వెళుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ ఉపాధ్యాయుడు తమ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తిస్తే ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు ఏమాత్రం తక్కువ కాదు. కొందరు ఉపాధ్యాయులు కేవలం వస్తారు.. వెళ్తారు.. తప్పా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టరు. అందుకే అధిక ఫీజులైనా తల్లిదండ్రులు ప్రైవేటుకు వెళుతున్నారు.

\- నర్సింహులు, రైల్వే ఉద్యోగి, గద్వాల

### మౌలిక వసతులు పెంచాలి



ప్రభుత్వ పాఠశాలలు గతంలో కంటే మెరుగయ్యాయి. మౌలిక వసతుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, ముఖ్యంగా ఉపాధ్యాయుల పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివేలా జీవో తీసుకురావాలి. అప్పుడు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయి. గ్రామాల్లో విద్యా కమిటీలను బలోపేతం చేసి బడిబాటను పకడ్బందీగా నిర్వహించాలి.

\- విజయభాస్కర్‌రెడ్డి, ఎంఏ ఫిజికల్ ఎడ్యుకేషన్, మక్తల్

### నిత్యం విద్యార్థుల అవస్థలు



వనపర్తి పట్టణంలోని ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లకు తలుపులు లేవు., వంటగది సక్రమంగా లేదు. విద్యార్థులు చేతులు కడుక్కోవడానికి నల్లాలు సైతం అమర్చకపోవడంతో నిత్యం అవస్థలు పడుతున్నారు. కూర్చోవడానికి బెంచీలు లేవు. ఉన్నతాధికారులు దృష్టి సారించి పాఠశాల ప్రారంభం నాటికి సమస్యలు పరిష్కరించాలి.

\- బాలమణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్, ఎంపీపీఎస్ ఇందిరానగర్

---

పనులు పూర్తయినా..

## ప్రయోజనం ఏదీ?

- ప్రసాద్ స్కీం నిధులతో అభివృద్ధి పనులు

7



అలంపూర్ క్షేత్రంలో ప్రసాద్ స్కీం నిధులతో నిర్మించిన భవనం

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

\- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావ త్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన నకిలీ పత్తి విత్తనాల నియంత్రణపై పోలీస్, వ్యవసాయశాఖ అధికా రులతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీమ్‌ల సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి లేని బీటీ-3 నకిలీ పత్తి విత్తనాల నియంత్రణకు పోలీస్, వ్యవ సాయ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీంలు విస్తృతంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. జూన్ నెల కంటే ముందుగానే వర్షాలు పడుతున్నందున వ్యవసాయ పనులు జోరందుకున్నాయని తెలిపారు. జిల్లాలో వరి తర్వాత అధిక విస్తీర్ణంలో పత్తి సాగు చేస్తారని, నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 2.86లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేసినట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు 2,865 క్వింటాళ్ల పత్తి విత్తనాలు అవసరం కాగా ఇప్పటికే 573 క్వింటాళ్ల పత్తి విత్తనాలను సరఫరా చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేని బీటీ-3 నకిలీ పత్తి విత్తనాలు వంటివి అమ్మడం, విత్తడం, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారిపై 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, పీడీ యాక్ట్ నమోదుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల్లో కూడా నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



వంద మంది కేసీఆర్‌లు వచ్చినా

## రాష్ట్ర ప్రగతి ఆగదు

- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- ఎన్నికల ముందే ప్రజలు దెయ్యాలను వదిలించుకున్నారు
- దెయ్యాలకు నాయకత్వం వహించిన కేసీఆర్ దేవుడు ఎలా అవుతాడు..
- మేం తెచ్చిన పథకాలే దేశానికి రోల్‌మోడల్‌గా మిగులుతాయి
- రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా ఎదిగితే కేసీఆర్‌కు దుఃఖం వస్తుందా..
- రూ. 43 కోట్లతో సబ్‌స్టేషన్లకు శంకుస్థాపనలు చేసిన ఉపముఖ్యమంత్రి



బల్మూరు మండలం గట్టుతుమ్మన్ గ్రామంలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చిత్రంలో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు

అచ్చంపేట/బల్మూరు,మే26 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో తెచ్చిన ప్రతీ పథకం దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తుందని వంద మంది కేసీఆర్‌లు వచ్చినా తెలంగాణ రాష్ట్ర ప్రగతి ఆగదని ఉపముఖ్యమంతి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో రూ. 43 కోట్ల అంచనాతో 5 విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణాలకు సోమవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా బల్మూరు మండలం గట్టుతుమ్మన్ గ్రామంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దెయ్యాలకు నాయక త్వం వహించిన కేసీఆర్‌దేవుడు ఎలా అవుతాడన్నారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని ఆయన కుతూరు కవిత ఇప్పుడు చెబుతున్నారని, కానీ ఎన్నికల ముందే రాష్ట్ర ప్రజలు ఈ దెయ్యాలను వదిలించుకొని ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారన్నారు. రాష్ట్రంలో వేసవిలో రికార్డు స్థాయిలో అంచనాలకు మించి 17,162 మెగావాట్ల విద్యుత్

మిగతా 6లో..

అన్నదాతకు..

## తేమ తంటా

- అకాల వర్షాలతో తప్పని తిప్పలు
- తేమ శాతం రాక కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం
- పట్టించుకోని అధికారులు
- రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్న రైతులు



వనపర్తి జిల్లా పెబ్బేరు , చెలిమిళ్ల గ్రామం కొనుగోలు కేంద్రంలో రాశులుగా ఉంచిన ధాన్యం

నారు పోసిన నాటి నుంచి కోతకోసే వరకు పంటను కంటికి రెప్పలా కాపాడుకున్న రైతన్నకు ధాన్యం అమ్ముకునే సమయంలో అవస్థలు తప్పడం లేదు. తెగుళ్ల బెడద, రాత్రింబవళ్లు అడవిపందుల నుంచి పంటను కాపాడుకొని చివరకు పంట కోసిన తరువాత ధాన్యాన్ని విక్రయించబోతే తిప్పలు తప్పడం లేదు. పూర్తిగా ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తొందరగా తూకం చేయకపోవడం. చేసినా మిల్లులకు తరలించడంలో అధికారుల జాప్యం చేయడంతో ధాన్యం మొలకెత్తుతోంది. 5 రోజులుగా కురుస్తున్న వర్షానికి తేమశాతం కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - వనపర్తి, ఆంధ్రజ్యోతి

6

### రౌడీయిజాన్ని అణిచివేస్తాం : ఎస్పీ

వనపర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణిచివేస్తామని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో నేర చరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉందని, ఎప్పుడు, ఎక్కడ ఏమీ చేసినా వెంటనే మా దృష్టికి వస్తుందని తెలిపారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యం, ఇతర కార్యకలాపాలకు పాల్పడాలని ఆలోచన ఉన్న వారు ఆ అలవాట్లను మార్చుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీషీట్లు, సస్పెక్ట్ సీట్లు పెడతామని హెచ్చరించారు. ప్రతీ ఒక్కరు తమ కుటుంబ సభ్యులతో జీవితాన్ని గడపాలని సూచించారు. కార్యక్రమంలో సీసీఎస్ సీఐ రవిపాల్, సీసీఎస్ ఎస్ఐ జయన్న ఉన్నారు.

## జూరాల ప్రాజెక్టుకు స్వల్పంగా వరద



ఎడమ కాలువ ఇంటెక్ వెల్ హెడ్ రెగ్యులేటర్ వద్ద చేరిన వరద నీరు

6

## ప్రతీ ఎకరాకు సాగునీరు

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి
- గుడ్డెందొడ్డి రిజర్వాయర్ ఫేజ్-1 నుంచి సాగునీరు విడుదల



గుడ్డెందొడ్డి రిజర్వాయర్ ఫేజ్-1 నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

ధరూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఎకరాకు సాగునీరు అందించి బీడు భూములను సైతం సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలంలోని గుడ్డెందొడ్డి సమీపంలో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ఫేజ్-1 పంప్‌హౌస్ వద్ద ఆయన స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. అనంతరం గంగమ్మకు పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా చెరువులు, కుంటలు నింపుతామన్నారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలతో కృష్ణానదిలో నీటి సామర్థ్యం పెరగింది. దీంతో గుడ్డెందొడ్డి రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేశామన్నారు. అదే విధంగా రెండు పంటలకు నీటిని అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నాలుగు టీఎంసీల సామర్థ్యం గల ర్యాలంపాడు రిజర్వాయర్‌లో రెండు టీఎంసీల నీటి నిలువ ఉంచుతామన్నారు. మిగిలిన వాటిలో కొంత ఇబ్బంది ఉందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. త్వరలోనే రిజర్వాయర్ పనులు పూర్తిచేసి చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రామన్‌గౌడ, సీనియర్ నాయకుడు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు సుదర్శన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు, నీటిపారుదల శాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చేయి చేయి కలిపారు.. పొలాలకు రోడ్డు వేశారు

- రహదారి నిర్మాణానికి నడుము కట్టిన రైతులు
- ఎకరానికి రూ. 2 వేల చొప్పున సేకరణ
- పెద్దపొర్ల గాడిదల వాగుపై రహదారి నిర్మాణం
- కల్వర్టు లైనా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



రైతులు సొంత డబ్బులు వేసుకొని నిర్మించిన పెద్దపొర్ల గాడిదుల వాగు ఊట్కూర్ రోడ్డు



జేసీబి పెట్టి రోడ్డు చదును చేసుకుంటున్నా రైతులు

ఊట్కూర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూసీ చూసీ విసిగిపోయిన రైతులు రహదారి నిర్మాణానికి నడుము బిగించారు. తలా కొంత డబ్బు వేసుకొని పనులు చేపట్టి, పూర్తి చేసుకున్నారు. ఆరేళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యను వారే పరిష్కరించుకొని అందరికీ ఆదర్శంగా నిలిచారు నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని పెద్దపొర్ల గ్రామ రైతులు....

### ధ్వంసమైన రోడ్డుతో అవస్థలు

ఊట్కూరు మండలంలోని పెద్దపొర్ల, చిన్నపొర్ల గ్రామస్థులు పొలం పనులకు, పీర్లపండుగకు, జాతర్లకు, సంతకు, ఆసుపత్రికి.. ఇలా మంచికీ, చెడ్డకు, వివిధ పనులకు 4 కిలోమీటర్ల దూరంలోని ఊట్కూర్‌కు గాడిదల వాగు మీదుగా కాలినడకన, ఎద్దులబండ్లపై తిరుగుతుండేవారు. అయితే నారాయణపేట - మక్తల్ బీటీ రోడ్డు నిర్మాణం తరువాత ఈ రెండు గ్రామాల నుంచి లింకు రోడ్లు ఏర్పాటు చేశారు. దీంతో అంతకు ముందున్న రోడ్డు వినియోగం తక్కువైపోయింది. కేవలం రైతులు పొలాలకు వెళ్లేందుకు మాత్రమే ఆ రోడ్డును వినియోగిస్తున్నారు. అయితే లింకు రోడ్డు మీదుగా పెద్దపొర్ల నుంచి ఊట్కూరుకు వెళ్లేందుకు దాదాపు 12 కిలోమీటర్లు అవుతుంది. పాత రోడ్డు మీదుగా అయితే 4 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కానీ ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్తుండేవి. ఆరేళ్ల క్రితం ఉపాధి హామీ పథకం కింద పాత రోడ్డుకు కొంత మేర మరమ్మతు చేశారు. అందుకోసం పొలాల్లోని చౌడు మట్టిని వినియోగించడంతో రోడ్డు పూర్తిగా డెబ్బతిన్నది. గుంతలు పడి బురదమయమై, ఎద్దుల బండ్లు కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పక్కనున్న పొలాల మీదుగా వెళ్లాలంటే ఆ రైతులు అభ్యంతరం చెప్తున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో వాగు దాటడం కష్టంగా మారుతోంది. దీంతో వాగుపై కల్వర్టు ఏర్పాటు చేయాలని, మెటల్ రోడ్డు వేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా ఫలితం లేకపోయింది.

### సొంత ఖర్చుతో రోడ్డు నిర్మాణం

పెద్ద గ్రామ రైతులకు గాడిదల వాగు అవతల దాదాపు 400 ఎకరాల మేర పొలాలున్నాయి. వర్షాలు వస్తే వాగు మీదుగా పొలాలకు వెళ్లడం కష్టంగా మారనుంది. దీంతో రైతులు తామే సొంతంగా రోడ్డు వేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కొంత ఇబ్బంది అయినా సరే ఎకరానికి రూ. 2 వేల చొప్పున సేకరించి రూ. 4 లక్షలను సిద్ధం చేసుకున్నారు. అనుకున్న ప్రకారం ఎక్స్‌కవేటర్ సాయంతో ఇరువైపులా ఉన్న మట్టిని తవ్వి రోడ్డుపై వేసి రోలర్‌తో చదును చేశారు. ఆ తర్వాత ట్రాక్టర్లతో మొరం తీసుకొచ్చి రోడ్డుపై వేసి, మళ్లీ రోలర్‌తో చదును చేశారు.

దీంతో ఆ రోడ్డు రాకపోకలకు సిద్ధమైంది. కానీ వాగుపై కల్వర్టులు ఏర్పాటు చేయకపోతే సమస్యలు తప్పే పరిస్థితి లేదు. కానీ వాటి నిర్మాణం ఖర్చుతో కూడినది కావడంతో ప్రజాప్రతినిధులు, అధికా రులు స్పందించాలని రైతులు కోరుతున్నారు. పొలాలకు వెళ్లే రోడ్డును తామే వసుకున్నామని, కనీసం కల్వర్టు నిర్మాణానికి చొరవ తీసుకోవాలని, పెద్దపొర్ల నుంచి ఊ ట్కూర్ వరకు మెటల్ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

#### అందరం కలిసి రోడ్డు వేసుకున్నాం



గాడిదల వాగు దాటి పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. కాలినడకన వెళ్లేందుకు కూడా వీలు లేకపోయేది. ఇలా ఆరేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. ఎరువులు, విత్తనాలను పొలాలకు తీసుకెళ్లడం కష్టంగా మారింది. కనీసం రోడ్డు మొరం వేసి చదును చేసినా ఎద్దుల బండ్లతో నైనా పొలాలకు వెళ్లేందుకు వీలు అవుతుంది. నాయకులు, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో అందరం కలిసి తలా ఇంత డబ్బు జమ చేసి రోడ్డు వేసుకున్నాం.

ఊరగంటి మల్లప్ప, రైతు

#### కల్వర్టులు నిర్మించాలి



వానలు మొదలైతే పొలాలకు వెళ్లడం కష్టం అవుతుంది. అందుకే తాలా ఇంత డబ్బు వేసుకొని ఎక్స్‌కవేటర్ సాయంతో మొరం వేసుకొని రోడ్డు వేసుకున్నాం. గాడిదల వాగుపై ఎనిమిది పెద్ద పైపులు వేసి, కల్వర్టు వేస్తే రాకపోకలు సులభం అవుతాయి. దీంతో పాటు మరో రెండు చిన్న కల్వర్టులు కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

కొల్లూర్ జయప్ప, రైతు

#### మెటల్ రోడ్డు వేయాలి



ఉపాధి హామీ పథకం కింద రోడ్డుపై మట్టి వేసినా, రోలర్ తిప్పలేదు. దీంతో వర్షం పడితే బురదగా మారుతోంది. దీంతో అందరం కలిసి సొంతంగా డబ్బు ఖర్చు చేసి రోడ్డు వేసుకున్నాం. ఈ దారిలో వెళ్తే ఊట్కూరుకు కేవలం నాలుగు కిలోమీటర్లు మాత్రమే అవుతుంది. కాబట్టి ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మెటల్ రోడ్డు ఏర్పాటు చేయాలి.

కొల్లూర్ శంకరప్ప, రైతు

## అన్నదాతకు తేమ తంటా

- అకాల వర్షాలతో తప్పని తిప్పలు
- తేమ శాతం రాక కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- రోడ్లుపైకి వచ్చి నిరసన తెలుపుతున్నరైతులు



మిల్లర్లు తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రాజనగరం గ్రామ రైతులు

వనపర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునే సమయంలో అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని సకాలంలో తీసుకొచ్చినా అధికారుల నిర్లక్ష్యంతో ఆగమవుతున్నారు. తూకం చేసిన ధాన్యాన్ని తరలించేందుకు లారీలు సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద పూర్తిగా ఆరబెట్టిన ధాన్యం 5 రోజులుగా కురుస్తున్న వర్షాలకు తేమ శాతం రావడం లేదని రైతులు వాపోతున్నారు. చాలా చోట్ల 17శాతం కంటే తక్కువ తేమ శాతం ఉన్నప్పటికీ కొనుగోలు చేయడం లేదు. ఇప్పటికీ చిన్నంబావి, వీపనగండ్ల, పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లోని కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకం చేయకపోవడంతో రైతులు పడిగాపులు కాస్తున్నారు.

### తేమ శాతం ప్రధాన అడ్డంకి

మొదటి నుంచి వనపర్తి జిల్లాలోని చిన్నంబావి, వీపనగండ్ల, పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లో వరి కోతలు ఆలస్యంగా ప్రారంభిస్తారు. 20 రోజుల నుంచి ఈ మండలాల్లోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం భారీగా వస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఈ మండలాల్లోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం వర్షానికి తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులతో తేమ 25 శాతానికి తక్కువగా నమోదు కావడం లేదు. తేమ శాతం రాకపోవడంతో నిర్వాహకులు ధాన్యం కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారు. అదేవిధంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు లారీల కొరత కూడా వేధిస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 40 కిలోల బస్తాకు 3 నుంచి 5 కేజీల వరకు కోత

కొనుగోలు కేంద్రంలో తూకం చేసిన తరువాత రైస్ మిల్లులకు వెళ్తే 40 కేజీల బస్తాపై 3 నుంచి 5 కిలోల వరకు కోత విధిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. మిల్లర్లు రైతులను దగా చేస్తున్నారని, ఇటీవలే రైతులతో కలిసి ఓ మిల్లర్‌పై బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ కలెక్టర్ ఆదర్శ్ సురభికి ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రజావాణిలో కూడా పలువురు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా మిల్లర్లలో ఎలాంటి మార్పు రావడం లేదు.

### ఇప్పటి వరకు 2.15లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 379 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 2.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో సన్న రకం ధాన్యం 95వేల మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం ధాన్యం 1.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందుకు గాను రూ.32వేల మంది రైతులకు రూ.469 కోట్లు చెల్లించాల్సి ఉండగా, 24వేల మంది రైతులకు రూ.330 కోట్ల ధాన్యం డబ్బులను వారి ఖాతాలలో జమ చేశారు.

### ధాన్యం తీసుకొచ్చి పది రోజులు అవుతోంది..



రోజూ కురుస్తున్న వర్షాలకు తేమ శాతం కూడా రావడం లేదు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తీసుకుపోవడానికి లారీలు లేక కొనుగోలు కేంద్రంలోనే తడుస్తున్నాయి. వర్షాలు కురుస్తున్నందున నిబంధనలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి.

- చెటమోని కృష్ణయ్య రైతు, శేరుపల్లి, శ్రీరంగాపూర్ మండలం

## జూరాల ప్రాజెక్టుకు స్వల్పంగా వరద

- జలాశయంలో 5.516 టీఎంసీల నీరు



జూరాలలో భారీగా వరద నీరు



ఎడమ కాలువ వైపునకు వస్తున్న వరద నీరు

అమరచింత/ దోమలపెంట, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. సోమవారం 2.888 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి వచ్చి చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.516 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి వరద ఇలాగే కొనసాగితే వారం పది రోజుల్లో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకునే అవకాశం ఉంది.

### 'శ్రీశైలం'లో 818.80 అడుగుల నీరు

దోమలపెంట, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఎగువన సుంకేసుల ప్రాజెక్టు నుంచి 4,496 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయం వైపునకు వస్తోంది. ప్రాజెక్టుకు సోమవారం సాయంత్రానికి 5,031 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండటంలో జలాశయంలో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడగులకు గాను, 818.80 అడుగులకు చేరింది. మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 215.807కు గాను 39.9680 టీఎంసీల నీటి నిల్వ నమోదు అవుతోంది. ఎంజీకేఎల్ఐ కాల్వ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పాదన కొనసాగడం లేదు. శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో 46.20 మిల్లీమిటర్ల వర్షం కురిసినట్లు డ్యాం గేజింగ్ అధికారులు తెలిపారు.

## తడ 'బడి'



నారాయణపేట ప్రభుత్వ పాఠశాలలో వర్షానికి నీటి నిల్వ



గద్వాల జిల్లా ఉదండాపూర్‌లో మన ఊరు- మనబడిలో భాగంగా పాత టాయిలెట్లు తొలగించి.. అలాగే వదిలేసిన దృశ్యం

( 5వ పేజీ తరువాయి )

తేటతెల్లమవుతోంది.

### ప్రత్యేక యాక్టివిటీస్ కరువు...

ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే కేవలం పాఠ్యపుస్తకాల్లో ఉన్న అంశాలే కాకుండా ఇతర యాక్టివిటీస్ కూడా అవసరం అవుతున్నాయి. అవి ప్రైవేటు పాఠశాలల్లో ఫుల్‌గా ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో నిల్ అని చెప్పవచ్చు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న పాఠశాలల్లో మినహాయిస్తే మెజారిటీ ప్రభుత్వ పాఠశాలల్లో ఆ తరహా యాక్టివిటీస్ ఉండటం లేదు. వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులే నైపుణ్యం కలిగి ఉంటారు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించని వారు ప్రైవేటులో విద్యాబోధనకు వెళుతున్నారు. అ లాంటప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన జరగాలి. కానీ నేటికీ ప్రైవేటులోనే విద్యాబోధన బాగుంటుందని ఆంధ్రజ్యోతి సర్వేలో విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్న పరిస్థితి. మౌలిక వసతుల విషయంలో కూడా ప్రభుత్వ పాఠశాలలు గతంలో కంటే మెరుగయ్యాయి. ఇంకా కొన్నిచోట్ల మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం లేని పాఠశాలలు ఉన్నప్పటికీ మెజారిటీ పాఠశాలల్లో మన ఊరు- మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించారు. కానీ ఇప్పటికీ సౌకర్యాలు సరిగా లేవనే భావనే విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావంతుల్లో ఉన్నది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు అక్కడ చదివితే విద్యా లక్ష్యాలు చేరుకులేమనే భావన ఉన్నట్లు తెలుస్తోంది. విద్యా సామర్థ్యాలను పెంపొందించడంలో కూడా తేడాలు ఉన్నట్లు స్పష్టమవుతోంది.

### పెరుగుతున్న సౌకర్యాలు - తగ్గుతున్న సంఖ్య...

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు పెరుగుతున్నా కొద్దీ విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఉదాహరణకు నారాయణపేట జిల్లాలో 2023-2024 విద్యా సంవత్సరంలో 494 ప్రభుత్వ పాఠశాలల్లో 70,045 మంది విద్యార్థులు చదివితే తర్వాతి సంవత్సరం వచ్చే సరికి పాఠశాలల సంఖ్య 533కి పెరిగినప్పటికీ 66,387కు విద్యార్థుల సంఖ్య తగ్గింది. అంటే దాదాపు 3,658 మంది విద్యార్థులు తగ్గారు. అదే ప్రైవేటులో 134 పాఠశాలలకు 2023-24 విద్యా సంవత్సరంలో 34,695 మంది విద్యార్థులు ఉండగా ఆ తర్వాత సంవత్సరానికి 8 పాఠశాలలు పెరిగి 37,968 మంది విద్యార్థులు చదివారు. 3273 మంది విద్యార్థులు ప్రైవేటులో పెరిగారు. వనపర్తి జిల్లాలో 2023-2024 విద్యా సంవత్సరంలో 518 పాఠశాలల్లో 36,282 మంది విద్యార్థులు చదివారు. ఆ తర్వాత సంవత్సరం 517 పాఠశాలల్లో 33,747 మంది చదివారు. ఒక్క సంవత్సరంలో 2,535 మంది విద్యార్థులు తగ్గారు. నాగర్‌కర్నూలు జిల్లాలో 852 ప్రభుత్వ పాఠశాలు ఉండగా 2023-24 విద్యా సంవత్సరంలో 1,31,885 మంది విద్యార్థులు చదివారు. తర్వాతి సంవత్సరంలో ఆ సంఖ్య 1,28,973కు పడిపోయింది. ఒక్క సంవత్సరంలో 2912 మంది విద్యార్థులు తగ్గారు. మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాల్లో మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పెరుగుతున్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో 488 పాఠశాలల్లో 1,10,762 మం ది విద్యార్థులు ఉండగా ఆ తర్వాత సంవత్సరం 1,17,754 మంది విద్యార్థులు ఉన్నారు. దాదాపు 6,994 మంది విద్యార్థులు పెరిగారు. అదే సమయంలో ప్రైవేటు పాఠశాల్లోనూ విద్యార్థులు దాదాపు 9,166 మంది పెరిగారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 2023-24లో 61,395 మంది విద్యార్థులు ఉండగా. తర్వాత సంవత్సరంలో 63532 మంది విద్యార్థులు చదివారు. దాదాపు 2137 మంది విద్యార్థులు పెరిగారు.

## వంద మంది కేసీఆర్‌లు వచ్చినా రాష్ట్ర ప్రగతి ఆగదు

(5వ పేజీ తరువాయి...)

డిమాండ్ వచ్చినప్పటికీ ఒక్క నిమిషం అంతరాయం లేకుండా సరఫరా చేశామన్నారు. రీజనల్ రింగ్‌రోడ్డు, మూసీ పునరుజ్జీవం, ప్రతీ జిల్లాలో ఉత్పత్తి రంగాన్ని పెంచాలన్న ప్రణాళికలతో రాబోయో రోజుల్లో కరెంట్ డిమాండ్ ఇంకా పెరుగనుందన్నారు. మరో 50 సంవత్సరాలకు కరెంటు డిమాండ్ ప్రణాళికలను తయారు చేసుకొని కాంగ్రెస్ ముందుకు పోతుందన్నారు. మరో రెండు దశాబ్దాల పాటు ఈ రాష్ట్ర అభివృద్ధికి కావలసిన ప్రణాళికలను ప్రజాప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఉద్యోగం వస్తుందని, ఫలితంగా గౌరవం వస్తుందని కొట్లాడి రాష్ట్ర యువత ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నారన్నారు. కోరి తెచ్చుకున్న రాష్ట్రంలో 10 సంవత్స రాలు పాలించిన కేసీఆర్ ఒక్కసారి కూడా గ్రూప్ 1 పరీక్ష నిర్వహించలేకపోయా రని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చి లక్ష ప్రభుత్వ ఉద్యోగాల కలను సాకారం చేస్తున్నామన్నారు. 57 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 30 వేల ఉద్యోగాలు పరిశీలనలో ఉన్నాయన్నారు. అర్హత ఉండి ఉద్యోగం రాని యువత కోసం రూ. 9 వేల కోట్లతో రాజీవ్ యువవికాసం స్వయం ఉపా ధి పథకాన్ని తీసుకువచ్చామన్నారు. కేసీఆర్‌కు రాష్ట్రాన్ని చూస్తుంటే దుఃఖం ఎందుకని, రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇస్తున్నందుకా, సన్నరకం ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తున్నందుకా, రైతులకు రుణ మాఫీ చేసినందుకా, మహిళలను కోటీశ్వరు లను చేస్తున్నందుకా అని ప్రశ్నించారు. కౌలు రైతులకు కూడా ఏడాదికి రూ. 12 వేలు అందిస్తున్న ఘనత ప్రజా ప్రభుత్వానిదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతుల పథకంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేసినట్లు అచ్చంపేట నియోజకవర్గంలో 45 వేల పంపుసెట్లకు సోలార్ పవర్ ఏర్పాటు చేయడంపై విద్యుత్‌శాఖ అధికారులు అధ్యయనం చేస్తున్నారన్నారు. అనంతరం నియోజవర్గం లోని రైతులకు 150 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మ ర్‌లను అందజేశారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదవాళ్లను ధనికులుగా చేయడం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కష్టపడుతున్నారని అన్నారు. ఎంపీ మల్లురవి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న భూముల రిజిస్ట్రేషన్ల రేట్లు చాలా తక్కువగా ఉన్నాయని, ఇందులో ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు కనీసం రూ.20లక్షల చెల్లించే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, టీజీఎస్పీ డీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సిలబస్‌పై 11, 12 తేదీల్లో వర్క్‌షాప్

- పోస్టర్ విడుదల చేసిన పీయూ వీసీ



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్ బాబు

పాలమూరు యూనివర్సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి) : నూతన సిలబస్‌పై పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల అధ్యాపకులకు వచ్చేనెల 11, 12 తేదీల్లో రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. వర్క్‌షాప్‌కు సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం పరిపాలన భవనంలోని తన చాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబు, అధ్యాపకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ నూతన సిలబస్ జాతీయ విద్యావిధానం లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుందన్నారు. పరిశోధన ఆధారిత బోధనపై ప్రత్యేక దృష్టి సారించనున్నదని తెలిపారు. ప్రస్తుత విద్యా దృక్పథానికి అనుగుణంగా అధ్యాపకుల సామర్థ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ డాక్టర్ సునీత, ఉస్మానియా విశ్వ విద్యాలయం ప్రొఫెసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ దుర్గేషం, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి, డాక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

## నేడు 'దిశ' సమావేశం

- హాజరుకానున్నఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్, కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో, పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నదని, శాసనసభ్యులు, జిల్లా, మండల అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

## ధాన్యం కొనాలని రోడ్డెక్కిన రైతన్నలు



రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న శేరుపల్లి రైతులు

శ్రీరంగాపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు చేయాలని వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండల పరిధిలోని శేరుపల్లిలో రైతులు సోమవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతు ఆంజనేయులు మాట్లాడుతూ తడిసిన ధాన్యంతో అరిగోస పడుతున్నామని, యాసంగి సీజన్ ముగుస్తున్నా ధాన్యం కొనకుండా కాలయాపన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ నష్టానికి బాధ్యత వహించాలని అన్నారు. కొన్న కొద్దిపాటి ధాన్యం కూడా తరలించకపోవడంతో వర్షానికి తడుస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. సమాచారం తెలుసుకొని ఘటనా స్థలానికి వచ్చిన స్థానిక ఎస్ఐ రామకృష్ణ సమస్యను స్థానిక తహసీల్దార్ రాజుకు సెల్‌ఫోన్ ద్వారా వివరించారు. లారీ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టరుతో తహసీల్దార్ మాట్లాడి వెంటనే మూడు లారీలు తెప్పించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు కురుమూర్తి, ఎల్లస్వామి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## బావిలో దూకి వ్యవసాయ కూలీ ఆత్మహత్య

- కుటుంబ కలహాల వల్లే.. కూలీ స్వస్థలం మహారాష్ట్ర
- నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో ఘటన

వంగూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యవసాయ కూలీ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో ఈ ఘటన జరిగింది. వంగూరు మండల ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సీఎం రేవంత్‌రెడ్డి పొలాన్ని నాగేశ్వర్‌రావు అనే రైతు 20ఏళ్ల పాటు కౌలుకు తీసుకున్నాడు. ఆ పొలంలో పనిచేయడానికి మహారాష్ట్రకు చెందిన రెండు కుటుంబాలను కుదుర్చుకున్నాడు. అందులో ఓ కుటుంబానికి చెందిన ప్రవీణ్(32) తన భార్య సుమిత్రతో సోమవారం పొలంలోనే గొడవపడ్డాడు. గొడవపడుతూనే వెళ్లి అదే పొలంలో ఉన్న వ్యవసాయ భూమిలో దూకాడు. సమాచారం అందుకున్న సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ మహేందర్ ఘటనా స్థలానికి చేరుకొని మోటార్ల సహాయంతో బావిలోని నీటి తోడి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఓ కూతురు ఉన్నది.

క్రైం కార్నర్

## విద్యుదాఘాతంతో ఆవు మృతి


మృతి చెందిన పాడి ఆవు

వెల్దండ, మే 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల పరిధిలోని రావిచెట్టుబావి తండాకు చెందిన రైతు రాత్లావత్ మున్నానాయక్‌కు చెందిన ఆవు కరెంట్ షాక్‌తో చనిపోయింది. సోమవారం పొలంలో మేస్తున్న ఆవు నేలపై తెగిపడి ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో అక్కడికక్కమే చనిపోయింది. దాని విలువ రూ. 80 వేల వరకు ఉంటుందని రైతు తెలిపాడు.

## 20 గొర్రెల అపహరణ

మూసాపేట, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వద్ద ఉంచిన 20 గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వనపర్తి జిల్లా, అడ్డాకుల మండలం కందూరులో ఈ సంఘటన జరిగింది. మూసాపేట ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కందూరుకు చెందిన బాలయ్య, రమేశ్, రవి ఆదివారం సాయంత్రం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని జమిస్తాపూర్‌లో 60 గొర్రెలను కొనుగోలు చేశారు. రాత్రి వర్షం కురవడంతో గ్రామంలోని బాలయ్య ఇంటి వద్ద గొర్రెలను ఉంచి, ఓ కిరాణం దుకాణం ముందు నిద్రపోయారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మందలోని 20 గొర్రెలను అపహరించుకు వెళ్లిపోయారు. సోమవారం ఉదయం చూసుకోగా గొర్రెలు మాయం అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

కల్వకుర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఓ వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు కల్వకుర్తి ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని ఎర్రవెల్లి గ్రామానికి చెందిన నరేశ్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు అతడిని అరెస్ట్ చేసి, సోమవారం కోర్టులో హాజరు పరిచారు. అతడికి రెండు రోజుల జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఇంట్లో పేలిన ఫ్రిజ్

మక్తల్, మే 26 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలోని ఓ ఇంట్లో ఫ్రీజ్ పేలిపోయింది. పట్టణానికి చెందిన సంగంబండ బాల్‌రెడ్డి ఇంట్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆనంద్‌బాబు అనే వ్యక్తి అద్దెకు ఉంటున్నాడు. మూడు నెలల క్రితం ఆయన ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లిపోయాడు. ఆ ఇంట్లోని పై అంతస్తులో ఉన్న ఫ్రిజ్ ఆదివారం ఉదయం కంప్రెషర్ ఓవర్ లోడ్ అయి పేలిపోయింది. ఇంట్లోంచి పొగలు రావడంతో చుట్టు పక్కల వారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ నరేశ్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని తలుపులు పగులగొట్టి మంటలను ఆర్పివేశారు. దీంతో దాదాపు రూ. 20 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## పోస్ట్ ఆఫీస్‌లో చోరీ

బాలానగర్, మే 26 : మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్‌లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. సబ్ పోస్ట్ మాస్టర్‌గా పని చేస్తున్న తులసన్న శనివారం సాయంత్రం నాలుగు గంటలకు విధులు ముగించుకొని ఇంటికి వెళ్లారు. ఆదివారం సెలవు దినం కావడంతో కార్యాలయానికి రాలేదు. సోమవారం ఉదయం పోస్ట్ ఆఫీస్‌లో దొంగతనం జరిగినట్లు స్వీపర్ నర్సింహులు ఆయనకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన వచ్చి పరిశీలించగా, లాకర్ ఉంచిన రూ. 35,740లు, మరో చిన్న లాకర్‌లో ఉద్యోగి శ్రుతికి సంబంధించిన కొంత డబ్బు చోరీ అయినట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయన ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆగివున్న కారును ఢీకొన్న బైక్

» తండ్రీ కొడుకులకు గాయాలు


కారును ఢీకొట్టిన మోటారుసైకిల్

ఉండవల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై వస్తూ రోడ్డు పక్కనున్న కారును వెనుక నుంచి ఢీకొనడంతో తండ్రీ కొడుకులు గాయపడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి స్టేజీ సమీపంలో ఈ సంఘటన జరిగింది. గద్వాల మండలం లత్తీపురం గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు బుచ్చన్న, జమ్మన్న సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై కర్నూలుకు బయలుదేరారు. వారు వస్తు న్న బైక్ ఉండవల్లి స్టేజీ సమీపంలో రోడ్డుపై ఆగి వున్న కారును ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108కు ఫోన్ చేసి, అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# భట్టుపల్లి గ్రామానికి 48 ఇళ్లు

» నిర్మాణం పూర్తయ్యే దశలో 33 ఇళ్లు
» గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
» ఇందిరమ్మ లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

భూత్పూర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని భట్టుపల్లి గ్రామానికి 48 ఇళ్లు మంజూరయ్యాయని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అందులో 33 ఇళ్ల నిర్మాణం పూర్తి దశలో ఉన్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం భట్టుపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా సోమవారం మంత్రి పొంగులేటి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఇందిరమ్మ లబ్ధిదారులతో మాట్లాడారు. 13 ఇళ్లకు బేస్‌మెంట్ కింద లక్ష రూపాయల చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు కేటాయించిన నిధులను సకాలంలో మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం లబ్ధిదారు సబావట్ సమ్మితో మాట్లాడారు. బెస్‌మెంటు కింద లక్ష రూపాయలు ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. దీంతో ఆమె మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వైద్యం భాస్కర్, ఎంపీడీవో ప్రభాకరాచారి, గృహనిర్మాణ శాఖ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వనపర్తి జిల్లాలో వయోవృద్ధులు కేవలం 731 మంది మాత్రమే ఉన్నారా? ఔరా.. ఇదేమి విడ్డూరం. నమ్మశక్యం కాదు కదూ.. ఇదీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా పేర్కొనవచ్చు. సీనియర్ సిటిజన్ కార్డు ఒకటి ఉంటుందన్నది ఎవరికీ తెలుపకపోవడం కూడా ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. జిల్లా అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడం వల్ల జిల్లాలో 18 వేల మంది వయోవృద్ధులకు గాను కేవలం 731 మంది మాత్రమే ఈ కార్డును పొందడం గమనార్హం. ఈ ఏడాది కేవలం ఫిబ్రవరిలో ఒకే ఒక్క అవగాహన కార్యక్రమం నిర్వహించారంటే వారి పనితీరును ప్రశ్నిస్తోంది.



# వయోవృద్ధులు 731 మందేనా..?

- సీనియర్ సిటిజన్ కార్డుకు నోచుకోని వారు 17 వేల మందికి పైనే
- జిల్లాలో 18 వేల మందికి పైగా గుర్తింపు
- సరైన అవగాహన లేకపోవడంతో కార్డుకు దూరంగా..
- కార్డు పొందిన వారికి ఎంతో ఉపయోగం.. రాయితీలతో ప్రయోజనం
- 60 సంవత్సరాలు దాటిన వారికి ఈ కార్డు ఒక కల్పతరువు
- వయసు ధ్రువీకరణ పత్రాలతో ఒకే రోజులో కార్డు పొందే వెసులుబాటు


సీనియర్ సిటిజన్స్ కార్డు మంజూరు చేసే జిల్లా సంక్షేమశాఖ కార్యాలయం



వయోవృద్ధుల కోసం డీడబ్ల్యూవో అధికారులు మంజూరు చేసే సీనియర్ సిటిజన్ కార్డు

వనపర్తి టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ద్వారా ప్రభుత్వం అందించే సీనియర్ సిటిజన్ కార్డుతో ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. 60 సంవత్సరాలు దాటిన వారికి ఈ కార్డు ఒక కల్పతరువులా పని చేస్తుంది. సీనియర్ సిటిజన్ కార్డు చేతిలో ఉంటే దేశంలో ఎక్కడైనా ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో సులభతరంగా సేవలను పొందవచ్చు. అంతేకాకుండా అనేక ప్రభుత్వ రాయితీలను సీనియర్ సిటిజన్స్ సొంతం చేసుకునే అవకాశం పుష్కలంగా ఉంటుంది. కానీ సీనియర్ సిటిజన్ కార్డు అనేది ఒకటుంటుందనే విషయం గురించే క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రజలకు తెలియకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని వేలెత్తి చూపిస్తోంది.

**కనిపించని అవగాహన కార్యక్రమాలు...**

జిల్లాలో 18 వేల మందికి పైగా సీనియర్ సిటిజన్స్ ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వీరికి ప్రభుత్వం తరఫున అందించే సీనియర్ సిటిజన్ కార్డు కోసం నిత్యం గ్రామీణ స్థాయిలో గ్రామ సభలు ఏర్పాటు చేసి 60 సంవత్సరాలు దాటిన పురుషులు, 58 సంవత్సరాలు దాటిన మహిళలకు సీనియర్ సిటిజన్ కార్డును అందించాలి. కానీ జిల్లా అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడం వల్ల 18 వేల మంది వయోవృద్ధులకు గాను కేవలం 731 మంది మాత్రమే ఈ కార్డును పొందారు. ఈ ఏడాది కేవలం ఫిబ్రవరిలో ఒకే ఒక్క అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అది కూడా గ్రామీణ ప్రాంతాల్లో కాకుండా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. దాదాపు 17 వేల మందికి ఈ కార్డు గురించి సమాచారం తెలియకపోవడమో, లేక ఇతర వేరే కారణాలతోనో సీనియర్ సిటిజన్ కార్డు పొందలేకున్నారు. కార్డు కలిగినవారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సులభంగా పొందేందుకు వీలుంటుంది.

**రాయితీలు ఎన్నో...**

కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 2006లోనే సీనియర్ సిటిజన్స్ కార్డు కోసం మార్గదర్శకాలు జారీ చేసింది. వయోవృద్ధుల కార్డు కలిగిన వారు ఆర్టీసీ బస్సుల్లో టికెట్‌పై 25 శాతం రాయితీ, రైల్వే స్టేషన్‌లో ప్రత్యేకంగా టికెట్ కౌంటర్ ఉంటుంది. అవసరమైనవారు ఉపయోగించుకునేలా వీల్‌చైర్ సదుపాయం, ఒంటరిగా ప్రయాణించే మహిళలు, గర్భిణులకు లోయర్ బెర్త్‌ల రిజర్వేషన్ కేటాయింపులో ప్రాధాన్యత ఉంటుంది. పాస్‌పోర్టు సేవల్లోనూ వయోవృద్ధులకు రాయితీ అవకాశం ఉంటుంది. 60 ఏళ్లు దాటిన వారికి కొత్తగా పాస్‌పోర్టు పొందే సమయంలో స్లాట్ బుక్ చేసుకుంటే ఫీజులో 10 శాతం తగ్గింపు ఉంటుంది. కోర్టు కేసుల తేదీల కేటాయింపుల్లోనూ సీనియర్ సిటిజన్స్‌కు ప్రాధాన్యం ఇస్తూ సీనియర్ సిటిజన్‌లకు సంబంధించిన కేసుల విచారణలో న్యాయస్థానాలు ప్రాధాన్యమిస్తాయి. అంతేకాకుండా వారి అభ్యర్థన మేరకు ప్రత్యేక విచారణ తేదీలను కేటాయిస్తారు. బ్యాంకింగ్ సేవల్లోనే సీనియర్ సిటిజన్స్‌కు ఎంతో ఉపయోగం కలుగుతుంది. ఆదాయం పన్ను చెల్లింపులోనే 60 సంవత్సరాలు పైబడిన వారికి రూ. 3 లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు ఉంటుంది. 80 ఏళ్లు దాటిన వారికి రూ. 5 లక్షల వరకు, 60 నుంచి 80 ఏళ్ల వయసున్న వారికి రూ. 3 నుంచి 5 లక్షల ఆదాయంపై 5 శాతం పన్ను రాయితీ, రూ.5-10లక్షల ఆదాయంపై 20 శాతం పన్ను, రూ. 10 లక్షలకు పైగా 30 శాతం పన్ను రాయితీ ఉంటుంది. అంతేకాకుండా ఆరోగ్య బీమా ప్రీమియంపై 80సీ సెక్షన్ కింద పన్ను తగ్గింపు వర్తిస్తుంది. ఇలాంటి వెసులుబాటులు ఎన్నో ఉన్న సీనియర్ సిటిజన్స్ కేవలం ఆధార్ కార్డు, పాన్ కార్డుతో పాటు రెండు ఫొటోలతో జిల్లా సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఒకే రోజులో సీనియర్ సిటిజన్ కార్డు పొందే అవకాశం ఉంది. ఈ కార్డు దేశవ్యాప్తంగా చెల్లుబాటు అవుతుంది.

### అర్హులైన ప్రతీ ఒక్కరు కార్డు పొందవచ్చు...



పురుషుల్లో 60 సంవత్సరాలు, మహిళల్లో 58 సంవత్సరాలు పైబడిన వారు సీనియర్ సిటిజన్స్‌గా గుర్తిస్తారు. జిల్లాలో గుర్తించబడిన 18 వేల మంది సీనియర్ సిటిజన్స్ కార్డుకు అర్హులు వీరందరూ కార్డు పొంది ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలతో పాటు వెసులుబాటును సద్వినియోగం చేసుకోవచ్చు. వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు రెండు ఫొటోలు తీసుకొచ్చి దరఖాస్తు చేసుకుంటే ఒకే రోజు కార్డు మంజూరు చేస్తాం. గ్రామీణ స్థాయిలో వయోవృద్ధుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- సుధారాణి, జిల్లా సంక్షేమశాఖ అధికారి, వనపర్తి.

# పనులు పూర్తయినా.. ప్రయోజనం ఏదీ?

» ప్రసాద్ స్కీం ద్వారా అభివృద్ధి పనులు
» రూ. 28 కోట్ల వ్యయంతో భవన నిర్మాణం
» వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
» నేటికీ వినియోగంలోకి రాని పరిస్థితి
» అలంపూర్‌లో భక్తుల అవస్థలు

అలంపూర్, మే 26(ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ క్షేత్రం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీం ద్వారా నిధులు మంజూరు చేసింది. మొత్తం రూ. 36 కోట్లతో పనులను ప్రారంభించారు. అందులో రూ. 28 కోట్లతో భారీ భవనాన్ని నిర్మించారు. అందులోనే అన్నదానసత్రం, ఫుడ్‌కోర్టు, కళ్యాణ మండపం, ఆర్ట్ గ్యాలరీతో పాటు 19 గదులు ఉన్నాయి. మల్టీ మీడియా, సౌండ్ అండ్ లైటింగ్ షోలు ఏర్పాటు చేశారు. ఈ భవనాన్ని గత ఏడాది మార్చి 7న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు ఆ భవనం నిరుపయోగంగానే ఉంది. దీంతో జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి దర్శనం కోసం అలంపూర్ క్షేత్రానికి వచ్చే భక్తులకు అవస్థలు తప్పడం లేదు.

**అర కిలోమీటరు దూరంలో..**

జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ సముదాయానికి అర కిలోమీటర్ దూరంలో ప్రసాద్ స్కీం భవనాన్ని నిర్మించారు. కొన్ని నెలల క్రితం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ క్షేత్రంలో పర్యటించారు. భవనాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే కలెక్టర్ కూడా భవనాన్ని పరిశీలించి, అన్నదాన సత్రం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కానీ ఇప్పటివరకు ప్రారంభానికి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం అన్నదాన సత్రం ఆలయంలోనే కొనసాగుతుండటంతో భక్తులకు ఇబ్బందిగా మారింది. అలాగే వసతి సౌకర్యం కోసం ప్రైవేటు లాడ్జిలను ఆశ్రయించాల్సి వస్తోంది. క్షేత్రంలో ప్రతీ సంవత్సరం దసరా నవరాత్రులు, జోగుళాంబదేవి నిజరూప దర్శనం, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దీంతో ఆలయానికి ఆదాయం పెరుగుతున్నా కనీస వసతులు కల్పించక పోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని ప్రసాద్ స్కీం భవనాన్ని ప్రారంభించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని, సమస్యలను పరిష్కరించాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

### సరైన మార్గమే లేదు



ఆలయానికి అర కిలోమీటరు దూరంలో ప్రసాద్ స్కీం భవనాన్ని నిర్మించారు. భక్తులు అక్కడికి వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడం సమస్యగా మారింది. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం భక్తులు సత్రానికి వెళ్లేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను ఏర్పాటు చేయాలి. తద్వారా భక్తులు సులభంగా అక్కడికి చేరుకునే సౌలభ్యం కలుగుతుంది.

ఇల్లూరు వెంకట్రామయ్య శెట్టి, అలంపూరు

### తాగునీటి సదుపాయం లేదు



అన్నదాన సత్రాన్ని ప్రారంభించాలంటే తాగునీటి వసతి అవసరం. అందుకోసం రెండు బోర్లు వేయించినా నీరు పడలేదు. దీంతో ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినా సత్రాన్ని ప్రారంభించలేదు. అలాగే సిబ్బందిని నియమించకపోవడంతో వినియోగంలోకి తీసుకురాలేక పోతున్నాం.

పురేందర్ కుమార్, ఈవో

# నేడు పీఎఫ్ సమస్యలపై సదస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : పీఎఫ్ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 27న సదస్సులు నిర్వహించనున్నట్లు హైదరాబాద్ - 2 రీజనల్ పీఎఫ్ కమిషనర్ -1 తేజ్ ప్రతాప్ సింగ్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'నిధి ఆప్కే నిక్మత్' పేరుతో ఈ సదస్సులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రీజినల్ పరిధిలోని వికారాబాద్ జిల్లా, తాండూర్ లోని పీపుల్స్ డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్‌లోని సీఎంఆర్ షాపింగ్ మాల్‌లలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్ మునిసిపల్ కార్యాలయంలో, నాగర్‌కర్నూల్ నగర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్ జిల్లా షేక్‌పేట్‌లోని నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాల, నారాయణపేట జిల్లా 'లంకలోని ఎస్ఎస్ ఎంటర్ ప్రైజెస్, టీడీ మాన్యుఫ్యాక్చర్స్‌లో ఉంటాయని తెలిపారు. గద్వాల పీఏసీఎస్, వనపర్తి జిల్లా, కొత్తకోట మునిసిపల్ కార్యాలయం, హైదరాబాద్ పీఎఫ్ రీజనల్ ఆఫీస్-2లో సదస్సులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుండి సాయంత్రం 5:45 గంటల వరకు సదస్సులు కొనసాగుతాయని, పీఎఫ్ ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలి

» అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర
» ఉత్సాహంగా జిల్లా జట్ల ఎంపికలు


అథ్లెటిక్స్ ఎంపికలను ప్రారంభిస్తున్న జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించి, పతకాలు సాధించాలని అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర అన్నారు. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో వచ్చేనెల 1న నిర్వహించనున్న 11వ తెలంగాణ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ టోర్నీలో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికకు సోమవారం మహబూబ్‌నగర్ స్టేడియంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. టోర్నీలో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు ఆనంద్‌కుమార్, రమేశ్‌బాబు, శ్రీనివాసులు, కోచ్ సునీల్ పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ధన్వాడ, మే 25 : (ఆంధ్రజ్యోతి) : నెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు శివ, అరుణ్ ఎంపికయ్యారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న 3వ పాస్ట్-5 జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున వారు పాల్గొననున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజారాం, కోచ్ రాంమోహన్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ సాంబయ్య శ్రీనివాస్‌నాయక్, పీఈటీ అంజనేయులు అభినందించారు.

# తల్లిదండ్రులే పాఠశాలకు యజమానులు

» రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి


బిగ్ స్కూల్స్ నిర్మాణానికి గాను స్థలాన్ని పరిశీలిస్తున్న మురళి

వంగూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు పాఠశాలకు యజమానులుగా వ్యవహరించాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. అందుకు అభివృద్ధి కమిటీ మార్గదర్శకత్వం వహించాలని సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, విద్యావేత్తలతో సోమవారం ఏర్పాటు చేసిన సమాలోచన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభ్యులు చారకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డి, డీఈవో రమేశ్ కుమార్ పాల్గొన్నారు. మీ ఊరి బడి ఎలా ఉంది? పిల్లలను ప్రైవేట్ స్కూల్‌కు ఎందుకు పంపిస్తున్నారు? ప్రభుత్వ బడికి యజమాని ఎవరు? పాఠశాలకు ఏ సౌకర్యాలు అవసరం? మెరుగైన విద్యాబోధనకు అర్హతగల ఉపాధ్యాయులు ఎక్కడ ఉన్నారు? తదితర విషయాలను చర్చించారు. అనంతరం ఆకునూరి మురళి మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక స్థాయి నుంచి జూనియర్ కళాశాల స్థాయి వరకు సకల సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. అనంతరం బిగ్ స్కూల్స్ నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో మురళీమోహనాచారి, ప్రధానోపాధ్యాయులు చిన్నయ్య, శశాంక్‌రెడ్డి, దీప, రమ్య, అభివృద్ధి కమిటీ సభ్యులు గణేష్‌రావు, నరేందర్‌గౌడ్, ఎలాగౌడ్. జనార్దన్, రజియా బేగం పాల్గొన్నారు.

**అక్షర వనం పరిశీలన..**

కల్వకుర్తి (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణ సమీపంలోని అక్షర వనాన్ని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యుడు చారకొండ వెంకటేశ్ సోమవారం పరిశీలించారు. అక్షరవనంలో కొనసాగుతున్న విద్యావిధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఇంటర్వ్యూ..

### ఉపాధి కూలీలకు అన్నిరకాల పనులు

● సౌజన్య, ఏపీవో, ఉండవల్లి



ఉండవల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు అన్నిరకాల పనులు కల్పిస్తున్నామని మండల ఏపీవో సౌజన్య తెలిపారు. పలువిషయాలను ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

**ఈ ఆర్థిక సంవత్సరంలో మండలానికి ఎంత బడ్జెట్ మంజూరైంది?**

మండలానికి రూ.4.85 కోట్ల లేబర్ బడ్జెట్ మంజూరైంది.

**ఎంతమంది కూలీలు పనికి వస్తున్నారు?**

మండలంలో సుమారు1100 మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు.

**రోజువారీ వేతనం ఎంత చెల్లిస్తున్నారు?**

ప్రతీ కూలీకి రోజుకు రూ.270లు వేతనం చెల్లిస్తున్నాము.

**మండలంలో ఎక్కడెక్కడ పనులు చేపట్టారు?**

మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాము.

**ప్రధానంగా చేపట్టిన పనులు ఏవి?**

ఫార్మేషన్ రోడ్లు, మట్టికట్టలు, ఎస్సీ, ఎస్టీ భూముల్లో ల్యాండ్ లెవలింగ్ పనులు చేస్తున్నారు.

## న్యూస్ బాక్స్

### ఎమ్మెల్యే పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

వడ్డేపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): గద్వాల డీఆర్‌డీవో సీనియర్ అసిస్టెంట్ అధికారి శాంతినగర్‌కు చెందిన అస్లాం తల్లి సోమవారం అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలియడంతో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పట్టణంలోని నివాసానికి వెళ్లి ఆమె మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అధికారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

### గురుకుల ఉపాధ్యాయుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిలో బోధన కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని గురుకులాల జిల్లా సమన్వయ అధికారి కే.రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గట్టు, మానవపాడు, అలంపూర్ బాలికల పాఠశాలలు, అయిజ, ఇటిక్యాల, గద్వాలలోని బాలుర పాఠశాలల్లో బోధన కోసం పీజీ, బీఈడీ, టీఈటీ పాసైన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులని, ఈనెల 29న ఎర్రవల్లి, అయిజలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో డెమో ఉంటుందని తెలిపారు.

### పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డకు ఆరోగ్యం

మానవపాడు, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గర్భిణి పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారని డాక్టర్ యాకుబ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు, చెన్నిపాడు, గోకులపాడు గ్రామాల్లోని గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్రన్న, చిట్టెమ్మ, సంధ్య, శ్రీదేవి ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

### చేతివృత్తులపై అవగాహన

గట్టు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బోయలగుడ్డంలో రాజ్‌కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు చేతివృత్తుల, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. సంస్థ నిర్వాహకురాలు రత్నకుమారి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మహిళలు స్వయం ఉపాధి పొందడానికి టైలరింగ్, ఎంబ్రాయిడరీ, ఇతర పనుల వల్ల ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. బాల్యవివాహాలు చేయరాదని సూచించారు. కార్యక్రమంలో మహిళలు, విద్యార్థినులు, కిషోరబాలికలు, గ్రామస్థులు ఉన్నారు.

# సాగునీటి అభివృద్ధి పనులకు రూ.25 కోట్లు

● గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సర్వే కోసం రూ. 16.20లక్షల నిధులు మంజూరు

● గద్వాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

● విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): భూనిర్వాసితుల సాగునీటి అభివృద్ధి పనుల కోసం రూ.25కోట్లు, జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం గుడ్డెందొడ్డి రిజర్వాయర్ మిగులు పనుల సర్వే కోసం రూ.16.20 లక్షలు విడుదల అయ్యాయని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడారు. జూరాల నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం పనులను మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రారంభం చేయగా, మిగులు పనులు బీఆర్ఎస్ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో కొనసాగాయని, భారీ ప్రాజెక్టులైనందున సమయం తీసుకుంటున్నాయన్నారు. వాటి నిర్మాణాలను ఆపితే మన రైతాంగం నష్టపోతుందన్న ఉద్దేశంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నిర్మాణాలు జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. ఎగువ ప్రాజెక్టులలో డ్యాంలలో నీళ్ల లేక మార్చి, ఏప్రిల్‌లో నీళ్ల అందక పంటలు ఎండిపోయే పరిస్థితి బాధాకరమన్నారు. కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రికి కలిసి నీటిఎద్దడి రాకుండా తెలంగాణ మంత్రుల ఆధ్వర్యంలో కర్నాటక రాష్ట్రానికి వెళ్లి నీళ్ల విడుదల చేయించడం జరిగిందన్నారు. 150 కిలోమీటర్ల దూరంలో ఉండే నారాయణపురం డ్యామ్ నుంచి 1టీఎంసీ నీటిని విడుదల చేస్తే అక్కడి నుంచి ఇక్కడికి సగం టీఎంసీ నీళ్ల రావడం బాధాకరమన్నారు. భవిష్యత్తులో గుడ్డెందొడ్డి రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోకపోతే గద్వాల నియోజకవర్గంతో పాటు మహబూబ్‌నగర్ జిల్లా ఎడారిగా మారే అవకాశం ఉందని, 1.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న గుడ్డెందొడ్డి రిజర్వాయర్‌ను 20 టీఎంసీల నీరు నిల్వ చేసే ప్రపోజల్‌ను పంపడానికి నమూనా చిత్రీకరణ చేయడానికి రూ.16.20 లక్షలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. గద్వాల నియోజకవర్గ పరిధిలోని రైతులు అన్నిరకాల పంటలను సాగు చేయడం గద్వాల ప్రత్యేకతని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల జూన్ 2న ప్రారంభించనున్నామన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నా గద్వాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని అన్నారు.

కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్వ హనుమంతు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ, వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు ఉరుకుందు, తిక్కన్న, ఖాజా తదితరులు ఉన్నారు.

### సీఎం సహాయనిధి చెక్కు అందజేత

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం గద్వాలతో పాటు మల్దకల్ మండలం వివిధ గ్రామాలకు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ, ఆలయ కమిటీ చైర్మన్ బోయ వెంకట్రాములు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబర్, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, నర్సింహులు, గాంధీ, వీరేశ్, పరశురాముడు ఉన్నారు.

# లైసెన్స్‌డ్ సర్వేయర్లతో భూ సమస్యల పరిష్కారం

● కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల, మే 26 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ కలిగిన సర్వేయర్లతో భూ సమస్యలు పరిష్కారం కావడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. భూ సంబంధ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చిందన్నారు. భూమి యజమానులైన రైతులకు మెరుగైన సేవలను అందించే ప్రణాళికలో భాగంగా లైసెన్స్ పొందిన సర్వేయర్లను అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు. భూ భారతి చట్టం ప్రకారం భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ తదితర వాటిలో తప్పనిసరిగా సర్వే చేసి మ్యాప్ జత చేయాల్సి ఉంటుందని, దీని కోసం లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఎంపిక చేసి వారికి ప్రభుత్వం శిక్షణ అందిస్తుందన్నారు.

జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ద్వారా మే 26నుంచి 50 రోజులపాటు 281 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో థియరీతో పాటు ఫీల్డ్ ట్రైనింగ్ కూడా ఉంటుందని, ఫీల్డ్‌లో మంచి పనితీరు చూపాలంటే థియరీ పాఠాలను పూర్తిగా అర్థం చేసుకోవాలన్నారు. శిక్షణ ముగిసిన తర్వాత పరీక్ష ఉంటుందని, అందులో ఉత్తీర్ణులైన వారికి లైసెన్స్‌డ్ సర్వేయర్ సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకుని లైసెన్స్‌డ్ సర్వేయర్లు కావాలని సూచించారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్స్ ఏడీ రామ్‌చందర్, అభ్యర్థులు ఉన్నారు.

### కలెక్టరేట్ ప్రజావాణికి 48 దరఖాస్తులు

గద్వాల న్యూటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి మొత్తం 48 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించేదిశగా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు ఉన్నారు.

# 107 ప్యాకేజీ పనులు పూర్తి చేయాలి

గద్వాల న్యూటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ముచ్చోనిపల్లి రిజర్వాయర్ నుంచి 107ప్యాకేజీ కాలువ పనులు వదిలిపెట్టారని, ఆ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ముందు అయిజ మండల పరిధిలోని ఉత్తనూరు, తుప్పత్రాల, మేడికొండ రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య మాట్లాడుతూ ఈ రిజర్వాయర్ నుంచి 107 ప్యాకేజీ పనులు పూర్తయితే దాదాపు 400ఎకరాలకు నీటి సౌకర్యం అందుతుందని, దీంతో రైతులకు ఇబ్బందులు ఉండవన్నారు. ఉత్తనూరు శివారు వరకు ఎకరా రూ. 5 లక్షలు పరిహారం వచ్చిందని, దీని తర్వాత శివారు అయిన మేడికొండకు చెందిన ఓ రైతుకు 2.5లక్షల పరిహారం ఇవ్వడంతో అక్కడి రైతులు పనులు జరుగకుండా అడ్డుపడుతున్నారన్నారు. కాబట్టి ప్రభుత్వపరంగా రైతులకు రావాల్సిన నష్ట పరిహారాన్ని అందజేసి ప్యాకేజీ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు గోపాల్, తిరుమల్, వీరేష్, ఎర్రన్న, బీచుపల్లి, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

## చింతరేవుల శివారు భూములకు దారి ఇవ్వాలి

గద్వాల న్యూటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): ధరూర్ మండల పరిధిలోని చింతరేవుల గ్రామ శివారులో సర్వే నెంబర్లు 665,667/1/1/2/1, 667/1/1/2/2, 668గ1, 662, 634, 669, 666 ఈ నెంబర్లపై 100 ఎకరాల భూమి ఉన్నదని, అయితే ఇందుకు సంబంధించిన పొలాలకు కొంతకాలంగా బాట సమస్య ఉన్నదని రైతులు సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పొలాలకు వెళ్లడానికి చాల సంవత్సరాల నుంచి బాట ఉన్నప్పటికీ సర్వేనెంబర్ 666లో ధర్మన్న ఇందులో 2ఎకరాల భూమిని కొనుగోలు చేసి మా పొలాలకు వెళ్లే బాటను కూడా దౌర్జన్యంగా ఆక్రమించుకొని సాగు చేస్తుండటంతో బాట సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఇందుకు సంబంధించి ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవడంతో పాటు బాట సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు నర్సింహులు, మూకెప్ప, నల్లన్న, నాగన్న, చిన్న ఆంజనేయులు, లక్ష్మీ, వీరన్న, గంగన్న తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య

మల్దకల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ విద్య ద్వారా విద్యార్థుల భవిష్యత్‌కు ఉజ్వల బాటలు వేస్తాయని ఎంఈవో సురేష్ అన్నారు.

ఆ దిశగా విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. 2025-26 బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లు, మదర్స్ కమిటీలతో సమావేశం నిర్వహించారు.

### దివ్యాంగుడికి వీల్‌చైర్, ఆర్థిక సాయం అందజేత



రంజన్‌కు వీల్‌చైర్, ఆర్థిక సాయం ఇస్తున్న యువకులు

మానవపాడు, మే 26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడికి అతని స్నేహితులు, గ్రామ యువకులు వీల్‌చైర్, ఆర్థిక సాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన పింజరి రంజన్ కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లి పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో రెండు కాళ్ల పనిచేయక మంచానికే పరిమితమయ్యాడు. దీంతో సోమవారం మండల కేంద్రానికి చెందిన చిన్ననాటి స్నేహితుడు పోలీస్ రవి వీల్‌చైర్ అందించాడు. డీటీ తహసీల్దార్ ధరణీషా, గ్రామ యువకులు రవి, సురేశ్, శ్రీనువాసులు, శివరాం కలిసి రూ.8వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం తరపున కుటుంబానికి సాయం అందించాలని కోరారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఇటిక్యాల మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లిలో సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ అందజేశారు. టి.సుంకన్నకు 27,500, టి.వెంకటరాముడుకు రూ.17వేలు వైద్యం కోసం మంజూరయ్యాయి. కార్యక్రమంలో గ్రామస్థులు విష్ణువర్ధన్‌రెడ్డి, నల్లన్న,చిన్న మద్దిలేటి, శ్రీరాముడు,సీతారాముడు, రంగస్వామి, రామాంజనేయులు, రాముడు ఉన్నారు.

### పాఠశాల పరిశీలన

ఎర్రవల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారిందని సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో స్పందించిన కలెక్టర్ సంతోష్‌కుమార్ పాఠశాలను పరిశీలించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఎంఈవో అమీర్‌పాష పరిశీలించారు. పాఠశాల ఫైఫ్లోర్‌లో సమావేశపు గది తాళం విరగ్గొట్టి మద్యం తాగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై పాఠశాల హెచ్‌ఎంతో కలిసి ఎంఈవో కోదండాపురం ఎస్‌ఐ మురళికి ఫిర్యాదు చేశారు.

# గతుకుల రోడ్లపై అవస్థల ప్రయాణం

- మరీ అధ్వానంగా మారిన గ్రామీణ రోడ్లు



పూర్తిగా బీటీ లేచిపోయి గుంతలమయమైన తప్పట్లమోర్సు రోడ్డు

గట్టు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలకు వెళ్లే బీటీరోడ్లు గుంతలమయంగా మారాయి. ప్రయాణానికి ఏమాత్రం వీలులేకుండా తారు లేచిపోవడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్లకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేయించడం గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. స్థానికంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఉండి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో ప్రధానంగా చాగదోణ నుంచి కొత్తపల్లి మీదుగా బల్గెరకు వెళ్లే బీటీరోడ్డు గుంతలమయమైంది. తప్పట్లమోర్సు నుంచి తాటికుంట వరకు వచ్చే రోడ్డు బీటీలేచి పెద్దగుంతలు పడ్డాయి. చాగదోణ నుంచి మిట్టదొడ్డికి వచ్చే బీటీ రోడ్డుపై గుంతలుపడ్డాయి. చమనఖాన్‌దొడ్డి నుంచి బోయలగుడ్డం వరకు వెళ్లే బీటీరోడ్డుపై గుంతలు పడ్డాయి. ఇప్పటికే ఈ రోడ్లపై ప్రమాదాలు చోటుచేసుకుని ఆసుపత్రులపాలవ్వడంతో పాటు పలువురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలుపడ్డ రోడ్లపై ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



# చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు

● ప్రజావాణిలో ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుదారులకు చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 16 మంది ఫిర్యాదులు అందించారు. వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. వాటిలో గొడవలకు సంబంధించి 6, భూ వివాదాలకు సంబంధించి 5, కుటుంబ తగాదాలపై 1, గ్రామంలోని పందుల వల్ల పంట పొలాలు నాశనం అవుతున్నాయని 1, ఇతర అంశాలకు సంబంధించి 3 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఫిర్యాదులపై ఎలాంటి అలసత్వం చూపకుండా చర్యలు తీసుకొని, ఆయా ఫిర్యాదులపై చేపట్టిన పురోగతిని ఫిర్యాదుదారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగులయ్య, సీఐలు రవిబాబు, టాటాబాబు ఉన్నారు.

# సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి



మార్కెట్ యార్డ్ చైర్మన్‌తో కలిసి రైతులకు సబ్సిడీ విత్తనాలు ఇస్తున్న సుభాన్

గద్వాల, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీలో అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ సుభాన్ అన్నారు. సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో జీలుగ విత్తనాల విక్రయాన్ని మార్కెట్ యార్డ్ చైర్మన్ హన్మంతుతో కలిసి పీఏసీఎస్ చైర్మన్ సుభాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుభాన్ మాట్లాడుతూ ప్రభుత్వం 30 కేజీల జీలుగ విత్తనాలను సబ్సిడీలో రూ.2,137.50కు రైతులకు అందజేస్తుందన్నారు. పచ్చిరొట్ట ఎరువు వాడడం వల్ల పంటలకు పోషకాలు అంది నేల నల్లబారి నీటిని నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. అలాగే వేరు వ్యవస్థ భూమిలోపలికి పటిష్టంగా పెరుగుతుందని భూమిలోని నత్రజని శాతం పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ప్రతాప్ కుమార్, పీఏసీఎస్ సీఈవో వెంకటేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు



రఘురెడ్డికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

గద్వాల న్యూటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలపై జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ గద్వాల జిల్లాకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సోమవారం బీఆర్ఎస్ నాయకులు బాసుహనుమంతునాయుడు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకునేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం నుంచి ఉదయం ఆయన ఆధ్వర్యంలో వివిధ మండలాలు, గ్రామాల నుంచి మాజీ ప్రజాప్రతినిధులు హైదరాబాద్ వెళ్లారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో రఘురెడ్డి, కే.టి.దొడ్డి సీనియర్ నాయకులు చక్రధర్‌రావు, పాతపాలెం శ్రీనివాసగౌడు, పూడూరు ఏఆర్ సమితి నాయకులు, వివిధ మండలాల మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# రోగులను కాపాడటంలో పైలెట్‌ల పాత్ర కీలకం



పైలెట్ దినోత్సవంలో అంబులెన్స్ పైలెట్లతో జిల్లా కోఆర్డినేటర్ రత్నమయ్య

● జిల్లా కోఆర్డినేటర్ రత్నమయ్య

గద్వాల న్యూటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో రోగులను కాపాడటంలో అంబులెన్స్ పైలెట్‌లు కీలకపాత్ర పోషిస్తున్నారని 108 జిల్లా కోఆర్డినేటర్ రత్నమయ్య అన్నారు. సోమవారం పైలెట్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని 108 అంబులెన్స్ కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. అనంతరం మాట్లాడుతూ క్షతగాత్రుల ప్రాణాలను కాపాడేందుకు పైలెట్‌లు ముందుంటారని, సకాలంలో వారు చేరి రోగులను ఆసుపత్రిలో చేర్పిస్తూ బాధితుల ప్రాణాలను కాపాడతారన్నారు. అంతేకాకుండా పేషెంట్‌ల పరిస్థితి విషమంగా ఉంటే వెంటనే వారిని డాక్టర్ల సూచన మేరకు కర్నూల్, హైదరాబాద్, మహబూబ్‌నగర్‌కు తరలిస్తూ పేషెంట్ల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తుంటారన్నారు. కార్యక్రమంలో అంబులెన్స్ పైలెట్‌లు పాల్వాయి అంజి, అభిషేక్, స్వాను, కృష్ణ, భాస్కర్, ప్రభాకర్, రవి, తిక్కన్న, రఘు పాల్గొన్నారు.

# ఇంటర్ సప్లిమెంటరీకి 1508 మంది హాజరు

● కేంద్రాలను పరిశీలించిన డీఐఈవో హృదయరాజు

గద్వాల టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 11 కేంద్రాల్లో ఐదవ రోజు సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 1508 మంది హాజరయ్యారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి జనరల్ విభాగంలో 1103 మందికిగాను 1059 మంది పరీక్షరాశారు. 44మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యకు సంబంధించి 116మందికి 108 మంది పరీక్ష రాశారు. 8మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్ విభాగంలో 315కుగాను 301మంది పరీక్ష రాయగా 14మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యకు సంబంధించి 45 మందికి గాను 40మంది పరీక్ష రాయగా ఐదుగురు గైర్హాజరయ్యారు.

జిల్లా కేంద్రం గద్వాలలోని రెండు కేంద్రాలతో పాటు అలంపూర్, మానవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాల ను డీఐఈవో హృదయరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

# టీడీపీ పూర్వవైభవానికి కృషి చేయాలి



అలంపూరు మండల అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్లా శాఖాద్రికి నియామక పత్రం ఇస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు

అలంపూరు మే 26 (ఆంధ్రజ్యోతి): అలంపూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం మండలాల వారీగా నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టీడీపీకి పూర్వవైభవం వచ్చేలా బలోపేతం చేయడానికి మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు ఎల్లవేళలా పార్టీకోసం కృషి చేయాలని, రానున్న కాలంలో తెలంగాణలో టీడీపీని అధికారంలోకి వచ్చేలా శాయశక్తులా ప్రయత్నం చేయాలని కోరారు. నూతన కమిటీ అలంపూరు అధ్యక్షుడిగా సయ్యద్ అబ్దుల్లా శాఖాద్రి, ప్రధాన కార్యదర్శిగా విష్ణుతేజ్ యాదవ్, వడ్డేపల్లి మండల అధ్యక్షుడిగా శివకుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కురువ శివప్రసాద్, మానవపాడు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈ నాగేశ్వర్‌రెడ్డి, ఎస్‌కె ఆజాద్ మియ్యా, ఉండవల్లి మండల అధ్యక్ష కార్యదర్శులుగా సయ్యద్ శాలిభాషా, మద్ది లేటి, రాజోలి అధ్యక్ష కార్యదర్శులుగా కుర్వ కిష్టన్న, గఫూర్, ఐజ మండల అధ్యక్ష కార్యదర్శులుగా టి.సుధాకర్‌గౌడ్, గోకారిని ఎన్నుకున్నారు.